క్లుప్తంగా

పంటల సాగుపై రైతులకు అవగాహన



దంతాలపల్లి/మరిపెడ రూరల్/డోర్నకల్: మండల కేంద్రం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

కళాశాలకు నూతన భవనం నిర్మించాలి



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర కళాశాలను ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మంగళవారం సందర్శించారు. కళాశాల భవనం శిథిలావస్థలో ఉందని, వర్షాకాలం సీజనల్‌లో భవనం నుంచి వర్షపు నీరు వస్తుందని, భవనం పెచ్చులు ఊడి పడుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చి విద్యారంగాన్ని పట్టించుకోవడంలేదన్నారు. కళాశాలకు నూతన భవనం నిర్మించిన ఇంటర్ విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోత్ సూర్యప్రకాష్, నాయకులు హరీష్, మహేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



మరిపెడ: హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ రాష్ట్రస్థాయి పోటీలకు మండలం నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు సీతారాంపురం పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాజకుమారి మంగళవారం తెలిపారు. మరిపెడ సీతారాంపురం ప్రభుత్వ పాఠశాలనుంచి సాత్విక, ఎడ్జర్ల ప్రభుత్వ పాఠశాల నుంచి సాత్వికనంద, నిత్యశ్రీ, మేఘన ఎంపికైనట్లు చెప్పారు. వీరు నేడు బుధవారం హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేయాలి

గూడూరు: మండల కేంద్రంలో ఏకలవ్య పాఠశాల నిర్మాణం కోసం కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని కోల్పోయిన బాధిత రైతులకు న్యాయం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలో ఏకలవ్య పాఠశాల నిర్మాణం కోసం అధికారులు స్వాధీనం చేసుకున్న ప్రాంతాన్ని మంగళవారం వారు పరిశీలించారు. ఈసందర్భంగా భూమిని కోల్పోయిన బాధిత రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అందులో ఓ రైతు కుమారుడు జిల్లా కేంద్రంలో హోంగార్డు ఉద్యోగం చేస్తుండగా, అధికారులు తొలగించారని తెలిపారు. బాధిత రైతులకు భూమికి బదులు భూమిని కల్పిస్తూ, హోంగార్డు ఉద్యోగం ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తేజావత్ వాసూనాయక్, ఎస్టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోతు రామన్న, చందూలాల్, వికలాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాందాస్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు భూక్య పద్మ, బాధిత రైతులు భూక్య కమలమ్మ, నాగమణి పాల్గొన్నారు.

మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జన్మదినోత్సవ వేడుకలు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నోట్‌బుక్స్ పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ యూపీఎస్ పాఠశాలలో అవని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవని ఫౌండేషన్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, వార్డు కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీత్లా భవానికి మొక్కులు

మహబూబాబాద్ రూరల్: బోడతండాలో మొక్కుల చెల్లింపు..



కురవి: బంచరాయి తండాలో పూజలు చేస్తున్న గిరిజనులు



దంతాలపల్లి: పంతులు తండాలో..



జిల్లా వ్యాప్తంగా బంజారా గిరిజన తండాల్లో మంగళవారం సీత్లాభవాని పండుగ ఘనంగా జరుపుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు పండాలని, పశువులు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ.. తండాల్లోని పంట భూముల వద్దకు వెళ్లి సీత్లాభవాని దేవతకు పాయసం, నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్



చిన్నగూడూరు: మొక్కులు చెల్లిస్తున్న గిరిజనులు



బయ్యారం: బాల్యాతండాలో పూజలు నిర్వహిస్తున్న బిందు, తండావాసులు



గార్ల: మండలం మర్రిగూడెం గ్రామంలో..



మరిపెడ రూరల్: భూక్యతండాలో గంపలతో వనానికి వెళ్తున్న మహిళలు



నైవేద్యంతో వెళ్తున్న చిన్నారి



డోర్నకల్: ఎర్రకుంటతండాలో గిరిజన దేవతలకు పూజలు



మరిపెడ: పూజలు చేస్తున్న గిరిజనులు



గూడూరు: చక్రుతండాలో..



మహబూబాబాద్: వినాయకతండాలో..



తొర్రూరు: గుడిబండ తండాలో..

విద్యారంగానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

కేసముద్రం: విద్యారంగానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అనేక సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. కేసముద్రంలో క్రైస్తవులకు శ్మశానవాటిక ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని జిల్లా, మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పిల్లికుమారస్వామి, అప్పాల పేతురు ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్ రావు, సురేందర్, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకు ప్రజాపాలన

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి ప్రగతి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ మున్సిపాలిటీలో మంచినీటి సమస్యను ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకపోగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేయగా సోమవారం రూ.20 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, దసరా నుంచి నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో మిట్టకంటి రామిరెడ్డి, చుక్కల ఉదయ్ చందర్, ఎడ్ల రమేష్, ఖలీల్, నాగేశ్వర్ రావు, వెంకన్న, ప్రభాకర్, రాజు, దస్రునాయక్ పాల్గొన్నారు.



కేసముద్రం: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

స్కావెంజర్లను నియమించాలి



సభ్యత్వం నమోదు చేస్తున్న మురళీకృష్ణ

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ అన్నారు. మండలంలోని పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతులు, బదిలీలను సజావుగా సాగేవిధంగా సహకరించిన ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన ఐదు డీఏలు, పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు హరినాయక్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు కుమార్, సీనియర్ కార్యకర్తలు మైసయ్య, ప్రసాద్, రాజశేఖర్, రంజాన్, షబ్బీర్, భరత్ కుమార్ పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

తొర్రూరు: అక్రమంగా తరలిస్తున్న 16క్వింటాళ్ల రేషన్ బియ్యం పోలీసులు పట్టుకున్న ఘటన మంగళవారం రాత్రి మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలానికి చెందిన వాంకుడోతు జయేందర్, అతని భార్య సుబ్బిలు ఊరూరు తిరుగుతూ అల్లం, వెల్లుల్లి వ్యాపారం చేస్తున్నారు. తక్కువ ధరకు రేషన్ బియ్యం సేకరించి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దానిలో భాగంగా మండల శివారు పాలకేంద్రం వద్ద పోలీసులు పట్టుకున్నారు. 16 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకోవడంతోపాటు జయేందర్, సుబ్బిలపై కేసు నమోదు చేశారు.

చిన్నగూడూరు: మండలకేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యంను స్థానిక పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్సై ఝాన్సీ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా, తర్కపల్లి మండలానికి చెందిన భుక్య శ్రీను మండలంలో వెల్లుల్లి వ్యాపారం పేరుతో ఇంటింటా తిరిగి రేషన్ బియ్యం కొని రైస్ మిల్లర్లకు అక్రమంగా తరలిస్తున్నాడు. ఈక్రమంలో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాహనం స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



చిన్నగూడూరు: పట్టుకున్న రేషన్ బియ్యం చూపుతున్న పోలీసులు

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

మరిపెడ: మండలంలోని రౌడీ షీటర్లంతా సత్ప్రవర్తనతో మెలగాలని సీఐ హత్తిరాం నాయక్ అన్నారు. మండలంలోని రౌడీషీటర్లకు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎక్కడ ఏ గొడవలు జరిగిన తలదూర్చవద్దన్నారు. ఎలాంటి నేరాలకు కూడా ఎట్టి పరిస్థితుల్లో పాల్పడవద్దని సీఐ హెచ్చరించారు. సమాజంలో గౌరవంగా బతకాలని, అప్పుడే కుటుంబానికి గుర్తుంపు ఉంటున్నారు. సీఐ వెంట ఎస్సైలు తాహేరబాబా, సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు మంగళవారం తొర్రూరు సీఐ సంజీవ్ కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్‌గా ఉండి కేసులు నమోదు అయితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

11న పంచాయతీరాజ్ కమిషనరేట్ ముట్టడి

గూడూరు: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బంది వేతన బకాయిలతోపాటు సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల జీపీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. మండలంలోని సీతానగరం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 11న యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే పంచాయతీరాజ్ కమిషనరేట్ ముట్టడికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజు, లక్ష్మయ్య, రాజాలు, వీరమల్లు, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు విడుదల చేయాలి

తొర్రూరు: పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాడ్య భీకు కోరారు. నిరసన కార్యక్రమ కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు.

దంతాలపల్లి: ఈనెల 11న తలపెట్టిన పంచాయతీ రాజ్ కమిషనరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని ప్రగతిశీల గ్రామపంచాయితీ వర్కర్స్ యూనియన్ తొర్రూరు డివిజన్ ప్రధాన కార్యదర్శి సెగ్గం యాకయ్య అన్నారు. కార్యక్రమంలో ఉప్పలయ్య, రాములు, వెంకటయ్య, మల్లయ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



గూడూరు: సీతానగరం జీపీ ఎదుట కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిబ్బంది

జీపీ ఎదుట కార్మికుల ధర్నా

కేసముద్రం: తమకు వేతనాలు వెంటనే ఇవ్వాలంటూ కేసముద్రంవిలేజ్‌లోని గ్రామపంచాయితీ ఎదుట జీపీ కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు అనిల్, అశోక్, యాకయ్య, ప్రమోద్, శివ, సంజీవ, మరియమ్మ, జ్యోతి, అలివేల, సూరమ్మ, లక్ష్మణ్, లింగమ్మ, జాన్సన్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రక్తదానం

నెహ్రూసెంటర్: డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కుమారుడు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర జన్మదినాన్ని పురస్కరించుకుని కురవి మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు మంగళవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దుడ్డెల వినోద్, గంగరబోయిన రఘు, కల్లెపు పవన్, వెంపటి విజయ్, పిడమర్తి ప్రశాంత్, మహేష్, వినయ్, శరత్, యూత్ నాయకులు పాల్గొన్నారు.

అనుమతి ఇవ్వొద్దు

కేసముద్రం: మహముద్‌పట్నం గ్రామంలోని గడ్డిబోడును తవ్వేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దని మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గోపాలకృష్ణ గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. గడ్డిబోడుపై యాదవుల కులదైవమైన లింగమంతులస్వామి, మైసమ్మ గుడి ఉందని సంఘం అధ్యక్షుడు శతకోటి నరేష్ తెలిపారు.

రైల్వే కార్మికుల సమస్యలపై పర్యటన

కేసముద్రం: మహబూబాబాద్ సెక్షన్‌లోని మహబూబాబాద్, కేసముద్రం, ఇంటికన్నె రైల్వే స్టేషన్‌లను మంగళవారం సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి జి.ప్రభురాజ్ సందర్శించి, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఏబీవీపీతోనే సమస్యలు పరిష్కారం

తొర్రూరు: ఏబీవీపీతోనే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతున్నాయని సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగధారి సిద్దు తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో ఏబీవీపీ 76వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు.

న్యాయవాదికి సన్మానం



మహబూబాబాద్ రూరల్: జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా నియామకమైన దేశబోయిన వెంకటస్వామిని పట్టణ గంగపుత్ర సంఘం సభ్యులు మంగళవారం ఆయన నివాసంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు మదేర్ల రాజన్న, దేశబోయిన అనిల్ కుమార్, డోలి మల్లేశం, దేశబోయిన రవి, చుక్కల నరేష్, అవారి సునీల్ కుమార్, డోలి కృష్ణ, చుక్కల శ్రీనివాస్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

మరిపెడ రూరల్: కడుపు నొప్పి భరించలేక ఓ మహిళా ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఉల్లెపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఉల్లెపల్లి గ్రామానికి చెందిన నవీలే రేణుక (36) కొద్ది రోజులుగా విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతుంది. ఈక్రమంలోని కడుపు నొప్పి భరించలే ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త నవీలే లాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలికి ఇద్దరు కుమారులు కలిగి ఉన్నారు.

కాల్వలో పిచ్చి మొక్కలు తొలగించాలి

డోర్నకల్: నెహ్రూస్ట్రీట్ మీదుగా వెళ్లే కొర్లకుంట అలుగు కాల్వను శుభ్రపర్చాలని స్థానికులు కోరుతున్నారు. కాల్వలో పెద్ద చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి కాల్వ మూసుకుపోయింది. కాల్వకు వరద వస్తే కాలనీకు ముంపు ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చి మొక్కలను వెంటనే తొలగించి శుభ్రపర్చాలని స్థానిక నాయకుడు మైనుపాషా డిమాండ్ చేశాడు.

మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలి

కురవి: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన బిల్లులను వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ కురవి మండల అధ్యక్షుడు కొలిపాక వీరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను సంఘం నాయకులు సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. బడుల్లో జరుగుతున్న పనులను సకాలంలో పూర్తి చేయాలని, పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, వర్షిత్, అనిల్, ఉజ్జి, అఖిల్ పాల్గొన్నారు.

'గ్యాస్ సబ్సిడీ రావడం లేదు'



గార్ల: అర్హులైన ప్రతీ ఒక్కరికి గ్యాస్, విద్యుత్ బిల్లుల్లో రాయితీ మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం సీపీఐ నాయకులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టబోయిన శ్రీనివాస రావు మాట్లాడారు. మండలంలో అనేక మంది అర్హులకు గ్యాస్ సబ్సిడీ వారి బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. అదే విధంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ గృహజ్యోతి పథకం సైతం అమలు కాకపోవడంతో లబ్ధిదారులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూర కాళ్లరిగేలా తిరుగుతూ నానా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీఓ రజినికి అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.